# ముల్లు

ప్రేమా కుముదానికి చిన్నప్పటి నుంచి పుస్తకాల పిచ్చి జాస్తి. క్లాసు పుస్తకాలు తప్ప కనిపించిన కాగితాన్నల్లా చదువుతుంది . పత్రికలకు, ప్రచురణ కర్తలకు ఆమె మహరాజపోషకురాలు.

అభిమాన రచయిత (త్రు)ల పుస్తకాలను ప్రచురణ అయిన మొదటి రోజు మొదటి కాపీ కొని చదవటం ఆమెకు గొప్ప సర్దా అయినపని. ప్రస్తుతం ఆమె అభిమాన రచయిత రవితేజ. కలం పట్టిన కొద్దిరోజుల్లోనే పాపులర్ రచయిత అయి వెలుగు తున్నాడు రవితేజ . అయితే పాపులర్ కాక ముందు నుంచే రవితేజ అభిమాని అయింది ప్రేమాకుముదం . అందుకు ఆమె దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. నచ్చిన రచనను భద్రపర్చటం, పుస్తకం వెనుక దాన్ని గురించిన తన అభిప్రాయాన్ని రాయటం ఆమెకు హాబీ. పత్రికల్లో ప్రచురించ బడిన రచనలు నచ్చితే వేరే పుస్తకంలో రాసుకొంటుంది. కానీ అభిమాన రచయిత (త్రు) లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపదు. రవితేజ రచనలు ఆమెకు నచ్చటానికి ముఖ్య కారణం - ప్రేమ. అతని యితివృత్తాలన్నీ ప్రేమచుట్టూతా తిరుగుతాయి. రచనల ద్వారా ప్రేమకు అతను చెప్పినన్ని నిర్వచనాలు మరో రచయిత చెప్పలేదని కుముదం నిరూపించగలదు. పైగా అతని ప్రేమ ఘట్టాలు సహజంగా వుంటాయి. పాఠకులను అనుభూతుల్లో ముంచుతాయి.

'ఓహో.... లౌలీ. బ్యూటిఫుల్' రవితేజ లేటెస్ట్ నవల చదువుతూ మైమరిచి పోతోందామె.

ఉన్నట్లుండి పక్క పోర్షనులో నుంచి కేకలు విన్పించాయి.

"షటప్! రాస్కెల్! నాకే ఎదురు చెప్తావ్? తోలు వలుస్తాను, ఏమనుకొన్నావో?"

చిరాగ్గా లేచి తలుపులన్నీ గట్టిగా మూసేసింది ప్రేమాకుముదం.

పక్క పోర్షనులో కొత్త దంపతుల జంట యిటీవలే చేరింది. చేరిన దగ్గరి నుంచీ యిదే వరస, న్యూసెన్స్.

భార్య అందంగా వుంటుంది. చదువుకొంది. భర్తకూడా బాగుంటాడు. ఏదో ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయినా ఏం లాభం? వారి మధ్య వో అచ్చటా ముచ్చటా లేదు. మొదట్లో అతనేమన్నా అమె ఏమీ జవాబు చెప్పేది కాదు. అతనింకా రెచ్చిపోయేవాడు. ఏదో మిష కలి పించుకొని ఆమె మీద చెయ్యి చేసుకొనేవాడు. యీ మధ్య ఆమె ఎదురు తిరిగి మాటకు మాట అనడం అరంభించింది. ఎదురు చెప్తున్నదన్న కారణంగా దేహశుద్ధి. ఏమిటో?

'ప్రేమలేని భార్యా భర్తల మధ్య కీచులాటలు కొట్లాటలుకాక మరేమిటుంటాయి?' అనుకొని పుస్తకం తెర్చింది కుముద.

ఈ నవలలో భార్యాభర్తల్లా ఎందుకుండరు జనం?

ఎందుకుండరంటే లోకంలో తొంభై శాతం జనానికి ప్రేమంటే ఏమిటో తెలియదు. ప్రేమలేని మనుష్యులకి పశుప్రవృత్తి కాక మరేమిటుంటుంది? యాంత్రిక జీవితం...ఛీ..ఛీ...

పోనీ పుస్తకాలన్నా చదివి ప్రేమించటం నేర్చుకోరేం ఈ జనం?

అయినా యీ రవితేజకు యిన్ని ప్రేమ రహస్యాలెలా తెల్సో? అతని పాత్రలు ఎంత బాగా మాట్లాడుతాయ్? ముఖ్యంగా పురుషపాత్రలు!

బహుశా ఆ పాత్రలన్నింటిలో కూడా రచయిత తనని ప్రొజెక్ట్ చేసుకొంటాడేమో! అంటే రవితేజ ఎంతటి మహోన్నత ప్రేమమూర్తి అయివుండాలి?

"అమ్మాయ్! నాన్నగారు పిలుస్తున్నారే. వొక్కసారి యిలా వస్తావూ?" తల్లి కేక వేసింది.

అమ్మో! నవల చివరికొచ్చింది. మంచి రసపట్టులో వుంది. ఇప్పుడు వెళ్ళటమే?

"ఉండమ్మా! కొంచెం సేపు ఆగి వస్తాను." తిరిగి కేక వేసింది కుముదం.

నవల తెర్చి నాలుగు పేజీలు చదివిందో లేదో దబదబ బాదుతున్న చప్పుడు! పక్క పోర్షన్‌లో భర్తగారు రుద్రావతారందాల్చినట్లున్నాడు. ఛీఛీ....పుస్తకంలో యింత ప్రేమ. పక్క పోర్షనులో అంతా ద్వేషమే! యీ ద్వేషవాతావరణంలో పుస్తకం చదివి ఏం లాభం? పుస్తకంలో ప్రేమ విలువ కూడా మాయమవుతుంది.

చదువుతున్న పేజీ కొనను సన్నగా మడిచి పుస్తకం మూసి లేచి తల్లి దండ్రుల వద్దకు బయలుదేరింది కుముదం.

కుముదం తండ్రి సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులో ఉద్యోగి. దేశంలో అన్ని ప్రాంతాలు తిరిగి తిరిగి చివరికి స్వంత ప్రాంతానికి వచ్చాడు.

ఇక్కడి నుంచి మళ్ళీ మరే మూలకో బదిలీ వచ్చేలోగా కూతురి పెళ్ళి చేయాలని ఆయన కోరిక. 'సమయం సందర్భం కల్సిరాకపోతే ఎంత డబ్బున్నా పెళ్ళిళ్ళు కావు. అలా వాయిదాలు పడ్తూనే ఉంటాయి' అన్నది ఆయన విశ్వాసం.

కుముదం పెళ్ళికోసం ఆయన ముందు జాగ్రత్తపడి బాంకులో డబ్బు కూడబెట్టేడు- కళ్యాణ కల్పతరువు స్కీమ్ క్రింద. ఆ గడువు అయింది. డబ్బు తీసుకోవచ్చు. కానీ కుముదానికి సంబంధం నిశ్చయమవుతేనా?

ఎన్నో సంబంధాలు తెచ్చేడు. ముందుగానే అన్నీ ఆలోచించి పెళ్ళిచూపులకి పిల్చుకువచ్చేవాడు. వాళ్ళకు పిల్లనచ్చేది. కట్నాలూ సమస్యకాదు. కానీ అన్ని సంబంధాలనీ కాదు పొమ్మంది కుముదం. కారణాలకే కరువా?

"అదేమిటమ్మా! అన్ని సంబంధాలను అలా కొట్టిపారేస్తే ఎలా? నువ్వు చెప్పే లోపం వొక్కటీ మాకు కన్పించటం లేదు. నీ మనసులో ఏదో ఉంది. ఎవరినన్నా ప్రేమించావా?"

తను ప్రేమించటమా? ఎవరిని ప్రేమిస్తుంది? ఎలా ప్రేమిస్తుంది? రూపాన్ని చూచా? విద్యను చూచా? ఉద్యోగాన్ని చూచా?

ఇవన్నీ వున్న వాళ్ళు ఎంత చక్కగా కాపురాలు చేసుకొంటున్నారో చూస్తూనే వుందిగా? ఎక్కడిదాకో ఎందుకు? పక్క పోర్షన్‌లోనే లేరూ?

తనని ప్రేమించే వాడిని తను ప్రేమిస్తుంది. తను ప్రేమనే ప్రేమిస్తుంది. కానీ తనను ఎవరు ప్రేమిస్తున్నారో ఎలా తెల్సుకోటం? ఎవరి మొహం చూచినా ప్రేమ వెలుగు కన్పించదే?

ఎవరి చిరునవ్వు వెనుక ఎన్నెన్ని విచ్చుకత్తులు దాగున్నాయో, తెల్లబట్టల వెనుక ఎంతెంత ద్వేషం, రాక్షసత్వం దాగి వుందో?

అమ్మో! వీళ్ళని నమ్మితే బురదలో దిగినట్లే. నిప్పును కౌగిలించుకొన్నట్లే!

"ఊహూ......"

"పోనీ ప్రేమించి పెళ్ళి చేసుకొందామనుకొంటున్నావా?"

ప్రేమించి కాదు-ప్రేమించబడి. కానీ ఆ విషయం ఎలా చెప్పటం?

"ఊహూ..........."

"అసలు పెళ్ళి చేసుకోవా?"

"పోనాన్నా! ఎందుకు చేసుకోను? నాకు నచ్చినవాడు కన్పిస్తే చేసుకొంటాను."

కూతురికి ఎవరు నచ్చుతారో, ఎలా తేల్చటం?

సంబంధాలు తేవటమే! ప్రాప్తమున్నప్పుడు అవుతుంది.

"రామ్మా కుముదం! రేపు నిన్ను చూడటానికి పెళ్ళివాళ్ళు వస్తున్నారు."

"ఓస్! ఇంతేనా? యిది మామూలేగా? ఎందరు రావటం లేదు-పోవటం లేదు.

"నేను పిల్లవాడిని చూడలేదనుకో. ఉద్యోగం తగు మాత్రందేనట! కానీ నీకో మంచి వార్త. అతనో రచయితట."

రచయితా! ఎవరో?

హఠాత్తుగా రవితేజ్ గుర్తు కొచ్చాడామెకు. అతను కాదు కదా? అంత అదృష్టమా తనకి? అతనికి పెళ్ళయే వుంటుంది. పెళ్ళి కాకుండానే అన్నన్ని ప్రేమ విషయాలు ఎలా రాయగలడు? దాంపత్య జీవితంలో మాధుర్యాలని గురించి ఎలా వర్ణించగలడు?

మరి తనని చూడ వచ్చే రచయిత ఎవరో?

బాలల రచయితా? హత్యల రచయితా? దయ్యాల రచయితా? పాముల రచయితా? ఆకలి రచయితా, కన్నీళ్ళ రచయితా? రక్తరచయితా? విరహ రచయితా? ప్రేమికుల్ని విడదీసే రచయితా?

కథా నిలయం
3610
శ్రీకాకుళం



కలిపే రచయితా?

"అతని పేరేమిటో చెప్పేడమ్మా! నాకు గుర్తు రావటం లేదు. పుస్తకాల మీద బాగానే సంపాదిస్తున్నాడట. నా ఫ్రెండ్ వొకడు సూచించాడీ సంబంధం. రచయితలంటే నీకిష్టం గదా? వెరైటీగా వుంటుందని పిలిపించమన్నాను. రేపొస్తున్నారు. ఏం ప్రోగ్రాం పెట్టుకోకు. నీకీ సంబంధం అన్నా నచ్చితే బాగుండును.'

"లక్షణంగా అన్నీ వున్న సంబంధాలు తెస్తే నిరాకరించావు. ఆఖరికి నీకెక్కడ రాసి పెట్టి వుందోనే ప్రేమా!"

ఆమెను తండ్రి కుముదం అని పిలుస్తాడు. తల్లి ప్రేమా అని పిలుస్తుంది.

"ఎక్కడ రాసి పెట్టి వున్నా ఫర్వాలేదమ్మా! ప్రేమించటం చాతనయిన ప్రేమమూర్తితో రాసి పెట్టి వుంటే నాకదే చాలు. నా అన్వేషణ అలాంటి ప్రేమమూర్తి కోసమే."

★ ★ ★

మర్నాడు పెళ్ళి చూపులకి చాలా ముందుగానే ఆ సంబంధాన్ని సూచించిన 'ఫ్రెండ్' వచ్చాడు. "ఆ రచయిత పేరేమిటో మీ ఫ్రెండ్‌ని కనుక్కోండి నాన్నగారూ!"

ఎందుకొచ్చిన దాగుడు మూతలు? ఆ రచయిత పేరు తెలిస్తే అతను ఎలాంటివాడో చెప్పేయగలదు తాను. తనకి నచ్చేదీ లేనిదీ తేల్చేసుకోగలదు. ఆ వచ్చే వాడిని బట్టి తను ప్రిపేర్ అయి వుంటే మంచిది కదా? ఎలాగూ ముడిపడని దానికి హంగామా దేనికి?

"అతని పేరు బాగానే వుందమ్మా! మనిషెలా గుంటాడో? ప్రఖ్యాత రచయితేటగా? పేరు రవితేజ్
"రవితేజ్.......రవితేజ్.........! ఓహో! లక్కీ! రవితేజ్!"

ఆమె పెళ్ళి అయిపోయినట్లే సంతోషించింది.

పెళ్ళి చూపుల్లో ఆమె మనసు ఎక్కడో ఆనంద లోకాల్లో విహరిస్తూ వుంది. పెళ్ళికొడుకును అసలు ఏం చూచిందో ఏమో!

చూచిన ఆమె తల్లిదండ్రులకు అతను ఏమాత్రం నచ్చలేదు. ఉద్యోగం చిన్నది. కుటుంబ ఆర్థికస్థితి అంతంత మాత్రమే. కుముదం వాళ్ళకు నచ్చింది.

"నా కూతురికి యిలాంటి సంబంధమటయ్యా సూచిస్తావ్?" పెళ్ళి వాళ్ళు వెళ్ళగానే ఫ్రెండ్ మీద తాటి చెట్టంత ఎత్తున లేచాడు తండ్రి.

"ఛ-ఛ....యీ సంబంధాన్ని నా కూతురు ఎన్నటికీ యిష్టపడదు. దీని తాతలాంటి సంబంధాలనే అది తోసి పారేసింది. తెల్సా?"

"కొంపతీసి యీ సంబంధం దానికి నచ్చిందేమో! నచ్చకపోతే ఎంత బాగుండును?'తల్లి అంది భయం భయంగా.

కానీ ప్రేమాకుముదం ఆ సంబంధం తప్ప మరోటి చేసుకోనని పట్టుబట్టింది. తల్లిదండ్రులు ఎన్నో విధాల నచ్చజెప్పి చూచారు.

"నా భర్తకు కావల్సింది అందం, డబ్బు, హోదా యిత్యాది కాదు నాన్నా! ప్రేమ వుండాలి. రవితేజ్ ప్రేమ స్వరూపుడు. ప్రేమమూర్తి." అతను ప్రేమమూర్తి అని కూతురు ఎలా గ్రహించిందో ఆ తల్లిదండ్రులకు అర్థం కాలేదు. కానీ ఏం చెయ్యటం?

★ ★ ★

కుముదాన్ని లోపలికి నెట్టి బయటి బోల్ట్ బిగించారు.

ఆమె తడబడుతున్న శరీరంతో, ఆనందప్రకంపనాలు చెందుతున్న మనసుతో నిలబడింది.

అది ఆమె మొదటి రాత్రి. అలాంటి ఎన్నో రాత్రులను అందంగా వూహించిన అభిమాన రచయితతో! పెళ్ళిలోనే అతను మాట్లాడిస్తాడనుకొంది. లేదు-పది మందిలో ప్రేమ ప్రదర్శించటం బాగుండదనుకొన్నాడేమో!

యిప్పుడు.....ఏకాంతం.......అయినా కాలం వృధా.....పలకరించడేం?

ఏం ఆలోచిస్తున్నాడో? నవలకు కొత్త థీమా?

అసలితను తనని ఎలా సంబోధిస్తాడో? నవలలో అతని పురుషపాత్రలు స్త్రీలను తమాషాగా సంబోధిస్తాయి. అప్పూ, నర్సూ.....అప్పల నర్సమ్మ కూడా అందంగా మారి పోవాల్సిందే అతని కలంలో పడి. తనదసలే అందమైన పేరు. ప్రేమ్ అని పిలుస్తాడా? కుముద్ అంటాడా? లేక రెండు పేర్లలో మొదటి అక్షరాలనో, రెండో అక్షరాలనో కలిపేసి.......ప్రేక్......మమ్మూ...... తన ఆలోచనకు నవ్వు వచ్చి ఆమె బిగ్గరగానే నవ్వింది.

ఛీ.....అతనేమనుకొంటాడు? తనని చూచే నవ్వేననుకోడూ? ఆమె వోరగా కళ్ళెత్తి చూచిందతడిని. అతడామెనోసారి చూచి అటు తిరిగి సిగరెట్ వెలిగించాడు. ముల్లు మనసుకు గుచ్చుకుంది.

ఛీ..ఛీ........యితను సిగరెట్లు కాలుస్తాడా? అందునా యిలాంటి సమయంలో! అతని నవలల్లో పాత్రలు సిగరెట్లు కాల్చిన గుర్తులేదే?

కాలాన్ని, రాత్రి నెమ్మది నెమ్మదిగా కొరుక్కుతింటం లేదూ? అయినా యితనికా స్ఫురణలేదేం? నవలల్లోలాగానే జీవితంలోనూ సస్పెన్సా? "ఎంతసేపని నిల్చుంటావ్? యిలా వచ్చి కూర్చోరాదూ? అవునూ-కాళ్ళు నొప్పులు పుడ్తే నవ్వొస్తుందా? అందగత్తెలు ఎందుకు నవ్వినా అందమేలే."

యిదేంటి? యీ డైలాగులేంటి? అసలు సంబోధనే లేదేం? అయ్యో! ప్రేమ....ప్రేమ.......ఏదీ?

ఆలోచిస్తోంది. మనసు ఆక్రోశిస్తోంది. ప్రేమకు ముల్లు...

"అలా మొద్దులా నిలబడితే ఏం బాగుంటుంది? దా. ప్లీజ్......"

అతనామెను ఎప్పుడు పట్టుకొన్నాడో-ఎలా పక్క వద్దకు తీసుకెళ్ళాడో-ఆమెకు తెలియదు. తెల్సుకొనేసరికి మొదటిరాత్రి అయిపోయింది.

★★★

పెళ్ళయిన కొత్తల్లో కొందరికి రోజులు పరుగెత్తుతుంటాయి. ప్రేమకు మెల్లగా నడుస్తున్నాయి. గడుస్తున్నాయి. ఆమె గర్భవతి అయింది. తండ్రి, పుట్టింటికి ప్రసవానికి తీసుకుపోవటానికి వస్తున్నానని రాసేడు. యివాళ వచ్చి రేపు తీసుకువెళ్ళే ఏర్పాటు అయింది.

ప్రేమ మనసు ఆ రోజు మరింత వ్యాకులంగా వుంది. ఏదో లోటు! కొరత.

"పెళ్ళయిన తర్వాత అదోలా వున్నావమ్మా నువ్వు? ఏమ్మా?' తండ్రి ఎన్నోసార్లు అడిగేడు. కానీ ఏమని చెప్పగలదు?

రవితేజను కోరి చేసుకున్నది. అతను దుర్మార్గుడేం కాదు. కొట్టడు. తిట్టడు. తనేది కావాలని అడిగితే అది తెచ్చిస్తాడు. డబ్బుకు లోటేం లేదు. మరి ఏం లోటంటే ఏం చెప్పటం? కొరత ఏమిటో ఏమని వివరించటం?

కానీ ఎంత సర్దుకొందామనుకొన్నా మనసులోని ఆ ముల్లు.....కలుక్కుమంటూనే వుంటుందేం? ఆ ముల్లును తీసేసుకుని పోవాలి. కాని ఎలా?

"నా నవలకు అకాడమీ బహుమతి వచ్చింది. యిదిగో వాళ్ళ దగ్గరి నుంచి వచ్చిన వుత్తరం." ఆమె తీసుకొని చూచింది. అది అతని మొదటి నవల. తనకి బాగా నచ్చిన నవల. ప్రేమను ప్రతిపదంలోనూ చిందించిన నవల.

ఒక విధంగా ఆ నవలే తనని వంచించింది. దగా చేసిందేమో!

"ఏమిటీ? దేశమంతా నన్ను అభినందిస్తున్నారు. యివిగో టెలిగ్రాం మెసేజెస్. కానీ కట్టుకున్న భార్య మాత్రం లాంఛనంగానైనా కంగ్రాచ్యులేషన్స్ చెప్పదు. అవున్లే, ఎన్ని డిగ్రీలుండి ఏం లాభం. సాహిత్యాభిలాష వుంటేగా? అవునూ నా నవల వొక్కటన్నా చదవలేదన్నావుగదా? నన్నెలా పెళ్ళి చేసుకొన్నావ్? అంత పెద్ద రంభవి కదా?"

ఇదే ప్రశ్నలు ఎన్నోసార్లు అడిగేడతను. అతనికి తన రచనల్ని ఎప్పుడూ పొగడాలని కోరిక. పొగడగలదు. కానీ రచనల్లో అమృతం పంచి, నిజజీవితంలో ఉప్పునీళ్ళు పంచే మనిషిని ఏమని పొగడటం? ఎలా పొగడటం? అసలు తనకి నవలలు చదివే అలవాటే లేదని అబద్ధమాడితే సరిపోలా?

ఆడింది. అతడు నమ్మేడు. కానీ ఆమె అతని నవలల్ని చదువుతూనే వుంది. అందులో అతని నిజరూపం ఏ నాటికైనా ప్రతిఫలించేనా? ఆశ-నిరాశే!

ఇక ఇప్పుడు తేల్చుకోవాలి. మనసులో ముల్లు తీసేసుకోవాలి. లేకపోతే...నూతన సృష్టి సక్రమంగా వుండదు.

"మీ ప్రశ్నకు నేను సమాధానం చెప్తాను. నేనడిగే వో ప్రశ్నకు మీరు సమాధానం చెప్తారా?"

"ఎప్పుడైనా చెప్పనన్నానా? అడుగు."

చెప్పననడు. సమాధానమే కాదు. ఏదైనా తను అడిగితే యిస్తాడు. కాని అతని పాత్రలు? అడగకుండానే యిస్తాయి. మనసెరిగి మసలుకొంటాయి. అది ప్రేమకు అతని భాష్యం. కాని నిజజీవితంలో అడగాలి. అడిగితే యిస్తాడు. అదీ ట్రాజెడీ!

"మీరు మీ రచనల్లో ప్రేమస్వరూపాన్ని గురించి అన్నన్ని రూపాల్లో చెప్తారు కదా? నిజ జీవితంలో మీ రింత జడులేం? పాత్రల్ని అన్ని విధాలుగా తియ్యతియ్యగా పిలిపించే మీకు భార్యను తియ్యగా పిలవటం కూడా చాత కాదేం?"

"ఓ! అయితే నా నవలల్ని నువ్వు చదివేవన్న మాట? చదవలేదని అబద్ధమాడేవన్న మాట?"

ప్రేమా కుముదం మాట్లాడలేదు. అతను సిగరెట్ వెలిగించాడు. గట్టిగా దమ్ము లాగేడు.

"అంటే....యస్. నేనిప్పుడు పరిపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతున్నాను. నువ్వు నన్ను ప్రేమించలేదు. నా రచనల్ని, అందులో నేను సృష్టించిన కొన్ని పాత్రల్ని, ప్రేమ స్వరూపాన్ని నువ్వు ప్రేమించావు. అందుకే నన్ను పెళ్ళి చేసుకొన్నావ్. నా రచనలలో పాత్రల్లాగా నేను ప్రవర్తిస్తానని ఆశించి నిరాశ పొందేవ్. అవునా?'

"అవును. తప్పా? ఒక రచయిత రచనల్లో కన్పించే జీవన దృక్పథం ఆ రచయిత వ్యక్తిత్వానికి కొలమానం కాదా?"

"కావచ్చునేమో! కానీ అన్ని సందర్భాలలో అది కుదరదు?"

"ఎందుకు కుదరదు? సైకాలజీలో పర్సనాలిటిని కొలవటానికి అనేక మార్గాలున్నాయ్. ఇంక్ బ్లాట్‌టెస్ట్, థీమేటిక్ ఆపర్‌సెప్షన్‌టెస్ట్....యిత్యాది........"

"ఉండవచ్చు! కానీ ఆ టెస్టులేమిటో నాకు తెలియదు ప్రేమా....నేను నీలాగా సైకాలజీని చదువుకోలేదు. ప్రజల అభిరుచి తెల్సుకొన్న రచయితను నేను. నా పర్సనాలిటీని కొలవటానికి నువ్వు నా రచనలపై ఆధారపడటం నిజంగా దురదృష్టం. నా రచనల్లో ప్రేమ దృశ్యాలన్నీ నా అనుభవాలు కాదు, నా విశ్వాసాలూ కాదు. విశ్వాసాల ఆధారంగా రాయవల్సి వస్తే నేనలా రాయనుకూడా."

"ఎలా రాస్తారు?"

"యిప్పుడు రాస్తున్నదానికి వ్యతిరేకంగా, చప్పగా రాస్తాను."

"అంటే మీరు ప్రేమను విశ్వసించరా?"

"ఎందుకు విశ్వసించను. కానీ స్త్రీపురుషుల మధ్య ప్రేమ వాచ్యంగా బహిరంగంగా వుండదు. అది మనోగతమైనది. క్రియా రూపంలో వున్నప్పుడే ప్రేమకు విలువ పెరుగుతుంది. కానీ రచనల్లో కాల్పనికతకు ప్రాధాన్యత నివ్వకతప్పదు. ఎందుకంటే మనిషి వాస్తవంపట్ల కన్నా కాల్పనికతపట్ల హెచ్చుగా ఆకర్షితుడవుతాడు గనుక."

ప్రేమ మనసులో ముల్లు మాయమయింది. మాయ తెర తొలగింది. "పైగా ప్రేమా! స్వభావసిద్ధంగా నేను...."

"మిత భాషిత్వం, జడత్వంవారులెండి. నేను గ్రహించాను." తను అతని ప్రేమను కాంక్షించింది. అడగకుండానే ఏమేమో చేయడం ప్రేమ రూపమనుకొంది. అందమైన మాటల్తో. పొగడటమే ప్రేమ వ్యక్తీకరణ లక్షణం అనుకొంది. కానీ ప్రేమ-పరస్పరం యిచ్చి పుచ్చుకొనేది. తనలాగానే అతనూ తన నుండి ఏమేమో ఆశిస్తే? ముల్లు తొలగింది.

"భార్యాభర్తల మధ్య ఆరాధనకన్నా అవగాహన ముఖ్యం అని నా అభిప్రాయం ప్రేమా. ప్రేమ యొక్క మౌలిక లక్షణం అవగాహనే."

"అవును! మిమ్మల్ని పెళ్ళి చేసుకొని మోసపోయాననుకొన్నానిన్నాళ్లూ. కానీ యిప్పుడు తెలిసికొన్నాను-మీ రచనల్ని చదివి నేను మోసపోయాను."

"అది నా అదృష్టం. కానీ ప్రేమా నన్ను నమ్ము. మోసం నాది కాదు. నా రచనల్ని ఆదరించే పాఠకులది. నా రచనా శిల్పానిది."

"ఇది మరీ బాగుండండోయ్. "మోహంలో అప్పుడే ప్రవేశించిన కుముదం తండ్రి, కూతురు మోహంలో వెలిగిన సంతోషాన్ని చూచి ఆశ్చర్యపోలేదు.

విజయ మాసపత్రిక, డిశంబర్, 1983